# పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి

:- పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్.

పరిగి మున్సిపల్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా

ముందుకు అడుగులు వేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్

పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించిన

పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్

పరిగి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు

అందుబాటులో పరిగి మున్సిపల్ చైర్ పర్సన్



వికారాబాద్ జిల్లా పరిగి ( మహి న్యూస్): పరిగి పట్టణంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు పట్టణంలోని పలువార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు ఎప్పటికప్పుడు చెత్త సేకరించి వీధులన్నీ శుభ్రంగా ఉండేలా చూడాలని కార్మికులను కోరారు దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేయిస్తామని తెలిపారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షించాలని మున్సిపల్ జవాన్ లకు సూచించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాదం అఖిల శ్రీనివాస్ , కో ఆప్షన్ ఆనం ఆంజనేయులు స్థానిక నాయకులు ఇలీయాస్ కాలనీవాసులు పాల్గొన్నారు



# రాఖీ స్పెషల్ ప్రోమో సాంగ్‌ను విడుదల చేసిన

### - పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): రాఖీ పండుగ సందర్భంగా పూడూరు మండల పరిధిలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సుభాష్ రూపొందించిన నూతన పాటకు సంబంధించిన ప్రోమో సాంగ్‌ను గాంధీ భవన్‌లో పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూడూరు మండల పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల రఘునాథ్ రెడ్డి , ఆత్మ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , పిఎసిఎస్ వైస్ చైర్మన్ సురేందర్ ముదిరాజ్ ,సీనియర్ నాయకులు కండ్లపల్లి శ్రీనివాస్ ,కంకల్ సర్పంచ్ వీరేశం ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# గాంధీభవన్‌లో ఎస్ ఐ ఆర్ అవగాహన సమావేశం

### - పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి,

### అర్హత కలిగిన ప్రతి ఒక్కరు కచ్చితంగా తమ ఓటును నమోదు చేసుకోవాలి:

### ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ తో పాటు కలిసి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా




కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఇన్‌చార్జిలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రాముఖ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని, ఓటరు జాబితాలోని లోపాలను సరిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారాసింగ్ ,కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఇన్‌చార్జిలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# నేడే పరిగి మండల కాంగ్రెస్ కమిటీ !?



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి మండల కాంగ్రెస్ కమిటీని సోమవారం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. మండల్ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఏర్పాటు విషయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్ క్రియాశీల పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. పరిగి మండలంలో కాంగ్రెస్ పార్టీని పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు జిల్లా ప్రధాన కార్యదర్శి దండు అశోక్ మండలంలో చురుకుగా పనిచేసి నాయకులను కమిటీలో తీసుకునేందుకు తనదైన శైలిలో మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట్ రాములు మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పరిధిలోని గ్రామాల లో చురుకుగా పనిచేస్తున్న నాయకుల వివరాలను సేకరిస్తున్నారు. దాదాపు సోమవారం రోజు కచ్చితంగా మండల కాంగ్రెస్ పార్టీ కమిటీని ఏర్పాటు చేసేందుకు దాదాపు ఖరారు అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఏదేమైనాప్పటికీ పరిగి మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో పటిష్టంగా పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మండల నాయకులు తమ భుజాలపై వేసుకొని ముందుకు సాగుతున్నారు. యువ నాయకుడు పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ బద్రి గారి రాజు పుల్లారెడ్డి మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో పటిష్టంగా చేయాలంటే మండల కమిటీ లో పనిచేసే నాయకులను ఎవరిని తీసుకోవాలి అనే కోణంలో గ్రామ గ్రామంలో పనిచేస్తున్న నాయకుల వివరాలను పూర్తిస్థాయిలో సేకరిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం పరిగి శాసనసభ్యులు టి రామ్మోహన్ రెడ్డి నివాసం దగ్గర పరిగి మండల కాంగ్రెస్ పార్టీ కమిటీని వేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దాదాపు పర్య మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ ఖరారు అయినట్లు సమాచారం. మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట్ రాములు కమిటీ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తూ అందరి సలహాలు సూచనలు తీసుకుంటూ కమిటీలో సభ్యులను కమిటీని దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ కోసం పనిచేసే వ్యక్తులకే మండల కాంగ్రెస్ పార్టీ కమిటీలో అవకాశం ఉంటుందని అంతేతప్ప వ్యక్తిగతంగా మండల కాంగ్రెస్ పార్టీ కమిటీలో అవకాశం ఉండదని పనిచేసే వారికే ఈ అవకాశం ఉంటుందని కమిటీలో ఎవరిని తీసుకున్న అందరు స్వాగతించాలని పార్టీ పటిష్టత ధ్యేయంగా మండల కాంగ్రెస్ పార్టీ కమిటీని వేయడం జరుగుతుందని కమిటీలో పనిచేసే వారికి అవకాశం ఉంటుంది సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు ఆధ్వర్యంలో పరిగి శాసనసభ్యులు సహాయ సహకారాలతో సలహాలు సూచనలతో వేస్తున్నట్లు సమాచారం

# దక్షిణ కొరియాలోని సియోల్‌లో మంత్రి నారా లోకేష్‌తో వైవీయూ ప్రొఫెసర్

### ఉన్నత విద్యారంగం పరిశోధనలపై విలువైన సూచనలు

సియోల్ మహిన్యూస్ ఆగష్టు 16: ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ఉన్నత విద్యాసంస్థలలో, ముఖ్యంగా గ్రామీణ నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులకు సౌకర్యాలు, ఆచరణాత్మక అభ్యాస అవకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయని, ఇది ఉపాధి మార్కెట్‌లో వారి పోటీతత్వాన్ని ప్రభావితం చేస్తోందని దక్షిణ కొరియా సియోల్‌లోని కొంకుక్ విశ్వవిద్యాలయంలో ఆహ్వానిత బ్రెయిన్ పూల్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కడప యోగి వేమన విశ్వవిద్యాలయం మెటీరియల్స్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ ఎం.వి. శంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ హెచ్‌ఆర్డీ శాఖ మంత్రి నారా లోకేష్, అధికారుల బృందం దక్షిణ కొరియాలోని సియోల్ సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, దక్షిణ కొరియా తెలుగు సంఘం (టాస్క్) సంయుక్తంగా సియోల్‌లోని లోట్టే హోటల్‌లో తెలుగు ప్రజల సమావేశాన్ని నిర్వహించాయి. దక్షిణ కొరియాలో నివసిస్తూ, పనిచేస్తున్న పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరై మంత్రితో ముచ్చటించారు. ఈ సభను ఉద్దేశించి నారా లోకేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగు సమాజానికి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై తమ సూచనలు, అభిప్రాయాలను పంచుకోవాలని వారిని ప్రోత్సహించారు. ఉన్నత విద్యపై జరిగిన చర్చ సందర్భంగా ప్రొఫెసర్ ఎం.వి. శంకర్ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య, పరిశోధన, ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడంపై తన అభిప్రాయాలను, సూచనలను పంచుకున్నారు. రాష్ట్రంలో సాంకేతిక, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే




లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన క్వాంటం వ్యాలీ వంటి కార్యక్రమాలను, అలాగే ఇతర చర్యలను ప్రొఫెసర్ శంకర్ అభినందించారు. దక్షిణ కొరియాలో ఉన్నత విద్య, పరిశోధన-అభివృద్ధి, పరిశ్రమలు, ఇతర రంగాలకు తెలుగు సమాజం అందించిన గణనీయమైన కృషిని కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.దక్షిణ కొరియాలోలాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో కూడా ఇలాంటి సంస్కరణలను తీసుకురావాలని కోరారు. ఉన్నత విద్యాసంస్థలలో, ముఖ్యంగా విశ్వవిద్యాలయాలలో బలమైన విద్యా, పరిశోధన మౌలిక సదుపాయాల ఆవశ్యకతను ప్రొఫెసర్ శంకర్ నొక్కి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుండి మేధో వలసలు కొనసాగుతుండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన అత్యంత అర్హత, శిక్షణ పొందిన నిపుణులు చాలామంది ప్రస్తుతం విదేశాలలో పనిచేస్తున్నారని వారి జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థుల ప్రయోజనం కోసం అందించడానికి సుముఖంగా ఉన్నారని, అయితే అటువంటి సేవలకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి మూడు కీలక ప్రాధాన్యతలు మంత్రి దృష్టికి తెచ్చారు. విద్యా మరియు పరిశోధన మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం,విద్యా పాఠ్యప్రణాళికలను నవీకరించడం, విద్యార్థులు మరియు అధ్యాపకులు నాణ్యమైన బోధన, అభ్యసనం, పరిశోధన చేపట్టేందుకు వీలుగా విశ్వవిద్యాలయాలకు ఆధునిక ప్రయోగశాలలు, అధునాతన పరిశోధనా సౌకర్యాలు, తగిన విద్యా మౌలిక సదుపాయాలను అందించాలి.విశ్వవిద్యాలయ-పరిశ్రమ సహకారాన్ని ప్రోత్సహించాలని ఉదాహరణ లతో వివరించారు. దక్షిణ కొరియాలో పనిచేసిన తన అనుభవం ఆధారంగా, విశ్వవిద్యాలయ విద్యార్థులు అధునాతన ప్రయోగశాల సౌకర్యాలు ప్రత్యక్ష శిక్షణ ద్వారా గణనీయమైన ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతారని ప్రొఫెసర్ శంకర్ వివరించారు. సూచనలకు స్పందిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని ఉన్నత విద్యా రంగంలో కొనసాగుతున్న సంస్కరణలు, కార్యక్రమాల గురించి నారా లోకేష్ సభికులకు వివరించారు. మీ సూచనలు అమలులోకి తీసుకుంటామని పాల్గొన్నవారికి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్య, పరిశోధనా రంగాన్ని బలోపేతం చేయడానికి, అలాగే భారతదేశంలో ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతికతలకు రాష్ట్రాన్ని ఒక ప్రముఖ కేంద్రంగా నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.

# కాకినాడ కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ 117వ జయంతి..



కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 16: సమాజంలో ప్రతి ఒక్కరూసర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు తెలిపారు.. ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్నగౌడ్ 117వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో కాకినాడ పట్టణ శాసన సభ్యులువనమాడివెంకటేశ్వరరావు,జిల్లా రెవెన్యూ అధికారి డా.డి. తిప్పేనాయక్, బీసీ సంక్షేమం సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ.. లక్ష్మణ్ గౌడ్ జయంతికార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికం గా నిర్వహించడంశుభపరిణామన్నారు. బహు జన హక్కుల సాధన కోసం,అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం లచ్చన్న చేసిన పోరాటాలు భావి తరాలకు ఎప్పటికీ మార్గ దర్శకమని కొనియాడారు. ఉత్తర కోస్తా కళింగసీమలోని ఉద్దానం ప్రాంతం (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకా బారువ గ్రామంలో 1909 ఆగస్టు 16న సాధారణ గౌడ్ కుటుంబం లో జన్మించిన లచ్చన్న,స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారని గుర్తుచేశారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతంతా.. బడుగు బలహీన వర్గాలకి ఏదైతే ఆశయాలు ఆలోచన విధానం ఉన్నాయో.. ఇప్పుడే నెరవేరుకుంటూ ప్రభుత్వం వస్తుందన్నారు.ఇంటికి రోడ్డు లేని సమయం లో.. బయటికి వస్తే బస్సులు కూడా లేని రోజుల్లో.. రైతుల కోసం పోరాటం.. మన స్వాతంత్రం కోసంపోరాటం.. ఈ రాష్ట్ర ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే.. అది గౌతు లక్ష్మణ్ గౌడ్ అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ముందుకు తీసు కెళ్లాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు పిలుపునిచ్చారు.




### జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్ మాట్లాడుతూ..

రైతులు,కార్మికుల హక్కుల పరిరక్షణ లో ఆయన చూపిన తెగువను ప్రశంసించారు.ప్రభుత్వ పరంగా,సామాజికంగా అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని డీఆర్వో సూచించారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఏ.శ్యామల కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస రావు,బీసీ సంక్షేమ సంఘం నాయకులు డా.చప్పిడి వెంకటేశ్వర రావు,చొల్లంగి వేణుగోపాలరావు, బాలాజీ ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జ్యూర్ ట్రాన్స్‌ఫర్ డే సందర్భంగా యానాంలో ఘన నివాళులు



యానాం, మహి న్యూస్, ఆగస్టు 16: డీ జ్యూర్ ట్రాన్స్‌ఫర్ డే సందర్భంగా యానాంలోని స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నం వద్ద పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పుష్పమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ శివరాజ్ మీనా, పోలీస్ శాఖ అధికారులు, యానాం మున్సిపల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యానాంలో రహదారి అభివృద్ధి పనులకు భూమిపూజ




**యానం, మహి న్యూస్, ఆగస్టు 16: యానాంలో రహదారి అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ద్రాక్షారామ రోడ్డులోని ఫిషరీస్ కార్యాలయం జంక్షన్ నుంచి పిడబ్ల్యూడి పార్క్ మీదుగా టాక్సీ స్టాండ్ వరకు దక్షిణ వైపున చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు పుదుచ్చేరి పిడబ్ల్యూడి మంత్రి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. రూ.59.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. రహదారిని మరింత వెడల్పు చేయడంతో పాటు, పిడబ్ల్యూడి పార్క్ వైపు స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి మల్లాడి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రహదారి అభివృద్ధి పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు, ప్రజలకు మరింత సౌకర్యం కలగనుంది. ట్రాఫిక్ సమస్యలు కూడా కొంతవరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ శివరాజ్ మీనా, పిడబ్ల్యూడిఅధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.**

# ఏటీఎంలో నగదు చోరీకి విఫలయత్నం... పోలీసుల అదుపులో నిందితుడు...




ముమ్మిడివరం, మహి న్యూస్, ఆగస్టు 16: ముమ్మిడివరం మండలం అనాతవరంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఎటిఎం లో నగదు చోరీకి ఓ వ్యక్తి విఫలయత్నం చేశాడు. అనాతవరం మెయిన్ రోడ్ లో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఏటీఎంలోకి ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ప్రవేశించి సీసీ కెమెరా వైర్లు ,ప్రింటర్లను ధ్వంసం చేశాడు. ఎంతకూ ఎటిఎం తెరుచుకోకపోవడంతో ప్రక్కన ఉన్న ఫ్యాన్సీ షాపు షట్టర్ను తొలగించి అందులో ఉన్న కూల్డ్రింక్స్ బాటిల్స్ ఎత్తుకుపోయాడు .బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎం.మోహన్ కుమార్, ఏ ఎస్ ఐ ఆర్ గోపాలకృష్ణమూర్తి, క్లూస్ టీం బృందం అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. సీఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఆర్.గోపాలకృష్ణమూర్తి కేసు నమోదు చేసి సిసి కెమెరా ఆధారంగా దర్యాప్తు చేయగా బ్యాంకు ఎటిఎం దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం చెందిన యల్లమిల్లి జయష్ బాబు గా గుర్తించారు. నిందితుడు గత రెండేళ్లుగా మతిస్థిమితం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు మానసిక వైద్యం చేయిస్తున్నారని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆదివారం తెల్లవారుజామున అనాతవరం ఐఓబి ఏటీఎంలోకి చొరబడి ఏటీఎం తోపాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. పోలీసులు నిందితుడిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతని మానసిక స్థితి సరిగా లేదని నిర్ధారించుకుని వైద్య సేవలు నిమిత్తం సోమవారం విశాఖ మానసిక వైద్యశాలకు తరలించినట్లు ఏఎస్ఐ గోపాల కృష్ణమూర్తి తెలిపారు.

# జిల్లాలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



విజయనగరం, మహి న్యూస్, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక ఉద్యమకారుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను జిల్లా అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, డీఆర్వో సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ మాట్లాడుతూ.. సమాజం, దేశం కోసం, సామాజిక వివక్ష నిర్మూలన కోసం, కార్మికులు, కర్షకులు, శ్రమజీవుల పక్షాన నిలబడి పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు. ప్రజల కోసం జీవితాంతం పోరాడిన గౌతు లచ్చన్న విగ్రహం విజయనగరం జిల్లాలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పలువురు నాయకుల విగ్రహాలను జిల్లాలో ఏర్పాటు చేసినప్పటికీ, గౌతు లచ్చన్నను విస్మరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు జీవితం గడిపిన గౌతు లచ్చన్న.. అనంతరం కూడా అనేక సామాజిక రుగ్మతలు, వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. ఆయన సేవలు, త్యాగాలను భావితరాలకు తెలియజేసేలా పట్టణంలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన స్థలాన్ని కేటాయించి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దాడ మధు, ప్రసాదుల ప్రసాద్, కోళ్ల బలరాం మాస్టారు, నరవ అప్పారావు, ఎలాగా విజయలక్ష్మి, గొల్లగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బిడ్డకు తల్లి ఎంత అవసరమో.. రాయచోటికి రాంప్రసాద్ రెడ్డి అంతే అవసరంశ్రీ

### - గండికోట సుధాకర్



రాయచోటి, మహిన్యూస్, ఆగస్టు 16 : రాయచోటి టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ మాట్లాడుతూ.. బిడ్డకు తల్లి ఎంత అవసరమో, రాయచోటికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి అంతే అవసరమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లుగా ఒకవైపు టీడీపీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, మరోవైపు రాయచోటి అభివృద్ధి కోసం మంత్రి రోజుకు 18 గంటలు శ్రమిస్తున్నారన్నారు. రాయచోటి ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.300 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లలో రూ.5కే భోజనం అందిస్తుండగా, రాయచోటిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి సొంత నిధులతో ఉచిత భోజనం అందిస్తున్నారని చెప్పారు. పేదల వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా దాదాపు రూ.15 కోట్లు మంజూరు చేయించిన ఘనత మంత్రికే దక్కుతుందని సుధాకర్ అన్నారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో గతంలో రోగులను తిరుపతికి రెఫర్ చేసేవారని, ప్రస్తుతం రాయచోటిలోనే రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేయించి పనులు ప్రారంభించారని తెలిపారు. రాయచోటి అభివృద్ధికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎంతో అవసరమని గండికోట సుధాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి కోటకొండ రవిశంకర్ మాజీ సర్పంచ్ బసయ్య మరియు ఏ ఎం సి డైరెక్టర్ ఉదయగిరి మస్తాన్వలి పాల్గొన్నారు..

# అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా నిర్మల్ కుమార్



రాయచోటి, మహిన్యూస్, ఆగస్టు 16 : భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి చేత నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగా రాయచోటికి చెందిన నిర్మల్ కుమార్ ను అన్నమయ్య జిల్లా బీజేపీ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన జిల్లా కమిటీ సభ్యులకు రాయచోటి బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# టీవీ యాడ్స్‌పై 12 నిమిషాల పరిమితి ఎత్తివేత.. కేంద్రం కీలక నిర్ణయం



టీవీ ఛానెళ్ల ప్రకటనలపై 12 నిమిషాల పరిమితిని ఎత్తివేసిన కేంద్రం

పోటీని ప్రోత్సహించి వ్యాపార సౌలభ్యం పెంచడమే లక్ష్యమని వెల్లడి

2006లో తెచ్చిన ఈ నిబంధన ప్రస్తుత పరిస్థితులకు సరిపోదని స్పష్టీకరణ

డిజిటల్ మీడియాతో సమాన పోటీ కల్పించేందుకే ఈ నిర్ణయమని మంత్రిత్వ శాఖ వివరణ

గెజెట్ నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి

టెలివిజన్ ఛానెళ్ల ప్రసారాల్లో ప్రకటనల సమయంపై ఉన్న కీలక నిబంధనను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. గంటకు 12 నిమిషాలు మాత్రమే ప్రకటనలు ప్రసారం చేయాలన్న పరిమితిని ఎత్తివేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. టీవీ, డిజిటల్ మీడియా మధ్య సమాన పోటీని ప్రోత్సహించడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. 1994 నాటి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనల కింద 2006లో ఈ 12 నిమిషాల ప్రకటనల పరిమితిని ప్రవేశపెట్టారు. అయితే, అప్పటి నుంచి ఇప్పటివరకు టీవీ ప్రసార రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని మంత్రిత్వ శాఖ వివరించింది. 2006లో దేశంలో కేవలం 62 టీవీ ఛానెళ్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 900కు పైగా ఉందని గుర్తు చేసింది. ఆ రోజుల్లో అనలాగ్ పద్ధతిలో ఉన్న కేబుల్ టీవీ ప్రసారాల వల్ల ఛానెళ్ల సంఖ్య పరిమితంగా ఉండేది. కానీ, ఇప్పుడు కేబుల్ టీవీ రంగం పూర్తిగా డిజిటలైజ్ అయింది. డీటీహెచ్, కేబుల్ టీవీ, ఐపీటీవీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు 300 నుంచి 500కు పైగా ఛానెళ్లను అందిస్తూ ప్రేక్షకులకు విస్తృత ఎంపికలు కల్పిస్తున్నాయి. దీనివల్ల మార్కెట్‌లో పోటీతత్వం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం పేర్కొంది. భారత్‌లో టీవీ రంగం 'పే' లేదా 'ఫ్రీ-టు-ఎయిర్' ఛానెల్ అనే దానితో సంబంధం లేకుండా ప్రకటనల ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. మరోవైపు, డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ప్రకటనలపై ఎలాంటి కాలపరిమితి నిబంధన లేదు. ఈ అసమాన పోటీ వాతావరణాన్ని సరిదిద్దేందుకే టీవీ ఛానెళ్లకు కూడా ఈ పరిమితిని తొలగించాలని నిర్ణయించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనలు-1994కు అవసరమైన సవరణలు చేసి, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

చిన్న గదిని పెద్దదిగా మార్చే టెక్నిక్..

# ఫర్నిచర్ ఇలా ఎంచుకుంటే చాలు!



- చిన్న గదులు విశాలంగా కనిపించాలంటే ఫర్నిచర్ ఎంపిక కీలకం
- నేలకు ఆనకుండా, కాళ్లున్న సోఫాలు, కుర్చీలు ఎంచుకోవాలి
- గ్లాస్ లేదా అద్దాల టేబుల్స్ వాడితే గది మరింత ఓపెన్‌గా కనిపిస్తుంది
- ఫర్నిచర్ ముందు కాళ్ల కిందకు వచ్చేలా పెద్ద రగ్గులు వాడాలి
- పైకప్పు ఎత్తుగా అనిపించేందుకు పొడవాటి కర్టెన్లు, ల్యాంప్స్ ఉపయోగించాలి


నగరాల్లో ఇరుకైన ఇళ్లలో నివసించే వారికి లివింగ్ రూం చిన్నగా ఉందనే భావన సర్వసాధారణం. అయితే, కొన్ని తెలివైన ఫర్నిచర్ ఎంపికలతో ఆ చిన్న గదినే విశాలంగా, స్టైలిష్‌గా మార్చుకోవచ్చని ఇంటీరియర్ డిజైనర్లు చెబుతున్నారు. ఫర్నిచర్ కొనేటప్పుడు ఒకే ఒక్క సింపుల్ టెక్నిక్ పాటిస్తే చాలు. నేరుగా నేలపై ఆనుకుని ఉండే సోఫాలు, కుర్చీలకు బదులుగా... కనీసం 4-5 అంగుళాల ఎత్తైన కాళ్లు ఉన్న ఫర్నిచర్‌ను ఎంచుకోవడమే ఆ రహస్యం. ఫర్నిచర్ కింద, చుట్టూ నేల కనిపించడం వల్ల గదిలో ఎక్కువ ఫ్లోర్ స్పేస్ ఉన్న భ్రమ కలుగుతుందని నిపుణులు వివరిస్తున్నారు. ఇది గదిని తేలికగా, ఓపెన్‌గా మార్చేస్తుంది. అదే సోఫాకు అంచులు (స్కర్ట్స్) ఉండటం, నేలను పూర్తిగా కప్పేసే ఫర్నిచర్ వాడటం వల్ల గది మరింత ఇరుకుగా, బరువుగా కనిపిస్తుంది. కాళ్లున్న ఫర్నిచర్‌తో పాటు గ్లాస్ లేదా అద్దాల సైడ్ టేబుల్స్ వాడితే గది మరింత ఓపెన్‌గా, ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. ఫర్నిచర్ ఎంపికతో పాటు దాని అమరిక కూడా చాలా ముఖ్యం. గదిని మొత్తం ఆక్రమించే భారీ సెక్షనల్ సోఫాకు బదులుగా, కాళ్లున్న ఎల్-ఆకారపు సోఫాను ఎంచుకోవడం మేలు. గదిని కుర్చీలతో నింపేయకుండా, అవసరమైన కొన్ని మల్టీ-ఫంక్షనల్ వస్తువులతో సర్దుకోవడం మంచిది. వీటితో పాటు మరికొన్ని చిట్కాలు కూడా గదిని విశాలంగా చూపడానికి సహాయపడతాయి. గదిలో పరిచే కార్పెట్ (తివాచీ) చిన్నగా కాకుండా, సోఫా, కుర్చీల ముందు కాళ్ల కిందకు సరిపోయేంత పెద్దదిగా ఉండాలి. ముదురు రంగులకు బదులుగా లేత రంగులు, గదిలోకి వెలుతురును ప్రతిబింబించే అద్దాలు, తేలికపాటి కర్టెన్లు వాడాలి. గది ఎత్తుగా కనిపించడానికి ఫ్లోర్ నుంచి సీలింగ్ వరకు ఉండే కర్టెన్లు, పొడవాటి ల్యాంప్స్, నిలువుగా ఉండే వాల్ ఆర్ట్ వంటివి ఉపయోగపడతాయి. ఈ చిన్న చిన్న మార్పుల ద్వారా గది అసలు సైజును మార్చకుండానే... దానిని ఎంతో విశాలంగా, ఆకర్షణీయంగా మార్చుకోవచ్చు.

# మీ ఇంటి బాల్కనీలోనే పండ్ల తోట.. ఇలా చేయండి!

- కుండీల్లో సులభంగా పెంచగలిగే పండ్ల మొక్కలు
- తక్కువ శ్రమ, నీటితోనే మంచి దిగుబడి
- జామ, దానిమ్మ వంటివి బాల్కనీలకు అనువైనవి
- కొన్ని నెలల్లోనే ఫలాలనిచ్చే స్ట్రాబెర్రీ మొక్కలు
- ఇంటిపట్టునే తాజా పండ్లు పొందే అవకాశం



ఇంట్లో పండించిన తాజా పండ్లను తినాలని చాలామందికి ఉంటుంది. కానీ, నగరాల్లో స్థలం లేకపోవడం, సమయం కేటాయించలేకపోవడం వంటి కారణాలతో చాలామంది ఆసక్తి ఉన్నా వెనకడుగు వేస్తుంటారు. అలాంటి వారి కోసం, తక్కువ శ్రమతో, చిన్న కుండీల్లోనే పెంచుకోగలిగే కొన్ని పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వీటి సంరక్షణకు ఎక్కువ సమయం కేటాయించకపోయినా, అప్పుడప్పుడు నీళ్లు పోయడం మర్చిపోయినా ఇవి తట్టుకుని నిలబడతాయి. ఈ మేరకు టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక కథనాన్ని ప్రచురించింది. బాల్కనీలు లేదా పరిమిత స్థలంలో పెంచుకునేందుకు అనువైన ఆ 5 మొక్కలేంటో ఇప్పుడు చూద్దాం.



జామ : ఈ జాబితాలో మొదటిది జామ మొక్క. ఇది ఎలాంటి నేలలోనైనా సులభంగా పెరుగుతుంది. అప్పుడప్పుడు నీళ్లు పోయడం మర్చిపోయినా తట్టుకుంటుంది. చీడపీడల బెడద కూడా తక్కువే. కనీసం ఒక అడుగు వ్యాసం ఉన్న కుండీలో నాటితే, ఒకటి లేదా రెండేళ్లలోనే ఫలాలను ఇవ్వడం ప్రారంభిస్తుంది.

స్ట్రాబెర్రీ : వీలైనంత త్వరగా ఫలితాలు కావాలనుకునే వారికి స్ట్రాబెర్రీ ఉత్తమ ఎంపిక. నాటిన కొన్ని నెలల్లోనే తియ్యని పండ్లను అందిస్తుంది. దీనికి ఎక్కువ స్థలం కూడా అవసరం లేదు. వేలాడే కుండీలు లేదా చిన్నపాటి టబ్బుల్లో కూడా వీటిని సులువుగా పెంచుకోవచ్చు.

అంజీర్ : అంజీర్ మొక్కకు కూడా పెద్దగా శ్రద్ధ అవసరం లేదు. ఎండ తగిలే బాల్కనీలో పెడితే చాలు. దీనికి స్వీయ పరాగ సంపర్కం జరుగుతుంది కాబట్టి, ఫలాల కోసం మరో మొక్క అవసరం లేదు. కాకపోతే, క్రమం తప్పకుండా కొమ్మలను కత్తిరించడం అవసరం.

దానిమ్మ : దానిమ్మ మొక్క వేర్లు లోతుగా వెళ్లవు. అందుకే కుండీల్లో పెంచడానికి ఇది చక్కగా సరిపోతుంది. ఇది కూడా స్వీయ పరాగ సంపర్కం చేసుకుంటుంది. పండ్లు రాకముందు పూచే అందమైన నారింజ రంగు పూలు బాల్కనీకి ప్రత్యేక ఆకర్షణ ఇస్తాయి.

మల్బరీ : మల్బరీ మొక్క చాలా వేగంగా పెరుగుతుంది. ఎలాంటి వాతావరణంలోనైనా తట్టుకుని నిలబడుతుంది. కుండీల్లో పెంచేటప్పుడు కొమ్మలను తరచూ కత్తిరిస్తూ ఉంటే, మొక్క అదుపులో ఉంటుంది. ఒకసారి పెరగడం మొదలైతే, మంచి దిగుబడిని ఇస్తుంది.

అయితే, ఈ మొక్కల పెరుగుదల, కాపు అనేవి వాతావరణం, కుండీ సైజు, తీసుకునే సంరక్షణపై ఆధారపడి ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. మీ ప్రాంతానికి ఏ రకం మొక్కలు సరిపోతాయో తెలుసుకోవాలంటే స్థానిక నర్సరీ లేదా ఉద్యానవన నిపుణులను సంప్రదించడం ఉత్తమం. కాస్త ఆసక్తి ఉంటే చాలు... మీ ఇంటి బాల్కనీలోనే తాజా పండ్లను ఆస్వాదించవచ్చు.

# ఇరాన్‌కు 2 టన్నుల బంగారం..
## యూఏఈ సంచలన నిర్ణయం వెనుక కారణమేంటి?

పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ యూఏఈ సంచలన నిర్ణయం

ఇరాన్‌కు 2 టన్నుల బంగారం, బిలియన్ల కొద్దీ నిధులు విడుదల చేసినట్లు కథనాలు

దాడుల నుంచి రక్షణ పొందేందుకే ఈ నిర్ణయమన్న విశ్లేషణలు

అబుదాబి నుంచి టెహ్రాన్‌కు ప్రత్యేక విమానాలు వెళ్లినట్లు నిర్ధారణ

ఆరోపణలను గతంలోనే ఖండించిన యూఏఈ ప్రభుత్వం



పశ్చిమాసియాలో ఇరాన్.. అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు సంచలనం సృష్టిస్తున్నాయి. భవిష్యత్తులో జరగబోయే దాడుల నుంచి తమ దేశాన్ని రక్షించుకునేందుకు, తమ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను యూఏఈ విడుదల చేసిందని ఈ కథనాల సారాంశం. వివరాల ప్రకారం, యూఏఈ సుమారు 2 టన్నుల బంగారం, బిలియన్ల డాలర్ల విలువైన నిధులను ప్రత్యేక విమానాల్లో ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. ఆగస్టు 11, 12 తేదీల్లో అబుదాబి నుంచి కొన్ని రాయల్ జెట్ విమానాలు ఇరాన్‌లోని మెహ్రాబాద్, పయామ్ విమానాశ్రయాలకు చేరుకొని, కొద్దిసేపటికే తిరిగి వెళ్లాయని ఏవియేషన్ వర్గాలు ధ్రువీకరించాయి. ఈ విమానాల్లోనే బంగారం, నగదు తరలించి ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ బంగారం విలువ సుమారు 283 మిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని సమాచారం. పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే, తమ భూభాగంపై ఇరాన్ ఎలాంటి దాడులకు పాల్పడకుండా స్పష్టమైన హామీ పొందేందుకే యూఏఈ ఈ చర్యకు దిగినట్లు అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తీవ్రమైన ఆర్థిక ఆంక్షలతో సతమతమవుతున్న ఇరాన్‌కు ఈ నిధుల విడుదల పెద్ద ఉపశమనం కలిగిస్తుంది. అయితే, ఈ వార్తలపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. తమ దేశంలోని ఇరాన్ ఆస్తులను విడుదల చేస్తున్నట్లు వస్తున్న వార్తలను యూఏఈ విదేశాంగ శాఖ గతంలోనే ఖండించింది. విమానాలు ప్రయాణించిన మాట వాస్తవమే అయినా, వాటిలో బంగారం, నగదు తరలించారనడానికి కచ్చితమైన ఆధారాలు ఇంకా బయటకు రాలేదు. ఏది ఏమైనప్పటికీ, ఈ 'రెండు టన్నుల బంగారం' వ్యవహారం ప్రస్తుతం పశ్చిమాసియా దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆదిత్య-ఎల్1 అద్భుత పరిశోధన..
## సూర్యుడి అతిపెద్ద రహస్యంపై కీలక ఆధారాలు!

సూర్యుడి కరోనా వేడి రహస్యంపై కీలక ఆధారాలు సేకరించిన ఆదిత్య ఎల్1

భారత్ తొలి సోలార్ మిషన్ పరిశోధనలో వెల్లడైన కొత్త విషయాలు


ఉపరితలం కన్నా వాతావరణం కొన్ని మిలియన్ డిగ్రీలు వేడిగా ఉండటానికి కారణాలపై అధ్యయనం

సౌర తుఫాన్ల తర్వాత శక్తి ఎలా భర్తీ అవుతుందో వివరించిన భారత శాస్త్రవేత్తలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

భారత అంతరిక్ష పరిశోధనలో ప్రతిష్ఠాత్మకమైన ఆదిత్య-ఎల్1 సౌర యాత్ర అద్భుతమైన ఫలితాలను అందిస్తోంది. సూర్యుడికి సంబంధించి దశాబ్దాలుగా అంతుచిక్కని ఓ అతిపెద్ద రహస్యాన్ని ఛేదించే దిశగా కీలక సమాచారాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సూర్యుడి ఉపరితలం కన్నా దాని బాహ్య వాతావరణం (కరోనా) మిలియన్ల డిగ్రీల మేర అత్యంత వేడిగా ఎందుకు ఉంటుందనే మిస్టరీపై ఈ పరిశోధన కొత్త విషయాలను తెరపైకి తెచ్చింది. భారత్ మొట్టమొదటిసారిగా సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 నుంచి అందిన డేటాను విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఈ వివరాలను వెల్లడించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన ప్రొఫెసర్ ఆర్. రమేశ్ నేతృత్వంలోని బృందం చేసిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. శాస్త్రవేత్తలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ప్రశ్న.. సూర్యుడి ఉష్ణోగ్రత తీరు. సూర్యుడి కేంద్రంలో దాదాపు 1.5 కోట్ల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. కానీ, మన కంటికి కనిపించే ఉపరితలం (ఫొటోస్ఫియర్) వద్ద కేవలం 5,500 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఆశ్చర్యకరంగా, ఉపరితలానికి ఎంతో దూరంలో ఉండే బాహ్య వాతావరణమైన కరోనాలో ఉష్ణోగ్రత సుమారు 20 లక్షల డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఏకంగా 4 కోట్ల డిగ్రీలకు కూడా చేరుకుంటుంది. వేడి పుట్టే కేంద్రం నుంచి దూరంగా వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గాల్సింది పోయి, ఇలా విపరీతంగా పెరగడం భౌతిక శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా అనిపించడంతో ఇది సౌర శాస్త్రంలో ఓ పెద్ద మిస్టరీగా మిగిలిపోయింది. సూర్యుడి నుంచి వెలువడే సౌర జ్వాలలు (సోలార్ ఫ్లేర్స్), కరోనల్ మాస్ ఎజెక్షన్స్ (సీఎంఈ) వంటి తీవ్రమైన సౌర తుపానులకు కరోనానే పుట్టినిల్లు. ఈ ప్రక్రియలో సూర్యుడు భారీ పరిమాణంలో శక్తిని, ఆవేశపూరిత కణాలను అంతరిక్షంలోకి విడుదల చేస్తాడు. దీనివల్ల భూమిపై అరోరాల వంటి అందమైన దృశ్యాలు ఏర్పడినప్పటికీ.. పవర్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నావిగేషన్ వ్యవస్థలు, శాటిలైట్లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రొఫెసర్ రమేశ్ ప్రకారం, సూర్యుడు సాధారణంగా తక్కువ చురుకుగా ఉన్నప్పుడు రోజుకు రెండు నుంచి మూడు సీఎంఈలను విడుదల చేస్తాడు. అదే 11 ఏళ్ల సౌర చక్రంలో గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు రోజుకు పదికి పైగా తుపానులను సృష్టిస్తాడు. ఈ క్రమంలో నిరంతరం శక్తిని కోల్పోతున్నప్పటికీ, కరోనా తన అత్యధిక ఉష్ణోగ్రతను ఎలా నిలబెట్టుకోగలుగుతుందనేది శాస్త్రవేత్తలకు అంతుబట్టలేదు. ఒకవేళ ఆ కోల్పోయిన శక్తి తిరిగి భర్తీ కాకపోతే, సూర్యుడు క్రమంగా చల్లబడిపోయి, సౌర వ్యవస్థ మొత్తం ప్రభావితమయ్యేది. ఆదిత్య-ఎల్1 అందించిన డేటా, ఈ శక్తిని కరోనా ఎలా తిరిగి పొందుతుందో వివరిస్తోంది. సౌర తుపానుల ద్వారా శక్తిని కోల్పోయినప్పటికీ, కొన్ని ప్రత్యేక ప్రక్రియల ద్వారా కరోనా తన ఉష్ణోగ్రతను పునరుద్ధరించుకుంటుందని భారత శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో తేల్చారు. ఈ ఆవిష్కరణ సౌర భౌతిక శాస్త్రంలో ఒక మైలురాయిగా నిలవడమే కాకుండా, భూమిపై సాంకేతిక వ్యవస్థలను ప్రభావితం చేసే సౌర తుపానులను మరింత కచ్చితంగా అంచనా వేయడానికి దోహదపడుతుంది.





### చిత్తూరు జాతి ఆవులతో ప్రత్యేక అనుబంధం..
## వైరల్ అవుతున్న ప్రధాని మోదీ వీడియో!

తన ఉదయం దినచర్యకు సంబంధించిన వీడియోను పంచుకున్న ప్రధాని మోదీ
అధికారిక నివాసంలో నెమళ్లు, ఆవులకు ఆహారం తినిపిస్తున్న దృశ్యాలు
స్వాతంత్ర్య దినోత్సవం రోజు తాను త్వరగా వెళ్తున్నానని అవి గ్రహించాయన్న ప్రధాని
ప్రధాని వద్ద ఉన్న వాటిలో చిత్తూరు జిల్లాకు చెందిన సూక్ష్మ జాతి ఆవులు
సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రధాని మోదీ వ్యక్తిగత వీడియో




ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఉదయం దినచర్యకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తన అధికారిక నివాసంలో నెమళ్లు, సూక్ష్మ జాతి ఆవులతో తాను గడిపిన మనోహరమైన క్షణాలను చూపిస్తూ ఒక వీడియోను పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ఉదయం ఈ దృశ్యాలను చిత్రీకరించినట్లు తెలుస్తోంది. తాను ఎర్రకోటలో జరిగే వేడుకలకు త్వరగా బయలుదేరుతున్నానని ఆ పక్షులు, పశువులు గ్రహించినట్లున్నాయని, అందుకే తనను కలిసేందుకు అవి ముందుగానే వచ్చాయని ప్రధాని మోదీ తెలిపారు. ఈ వీడియోలో ప్రధాని తన ఉదయం నడక, వ్యాయామంలో భాగంగా నెమళ్లకు గింజలు తినిపించడం, తన నివాసంలోని సూక్ష్మ జాతి ఆవులను ప్రేమగా నిమరడం వంటివి చూడవచ్చు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ ప్రధాని ఒక సందేశాన్ని జతచేశారు. “ప్రతిరోజూ ఉదయం నా స్నేహితులకు ఆహారం అందించడం నా దినచర్య. నిన్న ఉదయం నేను ఎర్రకోటకు త్వరగా బయలుదేరుతున్నానని అవి గ్రహించినట్లున్నాయి. అందుకే నేను వెళ్లేముందు నన్ను కలవడానికి వచ్చాయి. ఇది ఎప్పటిలాగే చాలా ప్రత్యేకం!” అని ఆయన పేర్కొన్నారు. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసంలో ఆయన ఉదయం వేళల్లో వ్యాయామం చేస్తున్నప్పుడు నెమళ్లు ఆయనతో పాటు ఉండటం సాధారణంగా కనిపిస్తుంది. ప్రధాని మోదీ వద్ద అరుదైన, దేశీయ సూక్ష్మ జాతి పశువులు ఉన్నాయి. ముఖ్యంగా వీటిలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన సూక్ష్మ జాతి ఆవులు కూడా ఉండటం విశేషం. ఈ జాతిని ప్రపంచంలోనే అత్యంత చిన్నవైన, మూపురం కలిగిన పశువుల జాతులలో ఒకటిగా గుర్తిస్తారు. ఇవి కేవలం 70 నుంచి 90 సెంటీమీటర్ల ఎత్తు మాత్రమే ఉంటాయి. గతంలో కూడా ప్రధాని ఈ ఆవులతో గడిపిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ తాజా వీడియో ప్రధాని వ్యక్తిగత జీవితంలోని మరో కోణాన్ని, ప్రకృతి, జీవరాశుల పట్ల ఆయనకున్న ప్రేమను తెలియజేస్తోంది.

### చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..
## రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం
డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం



తిరుపతి: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, “ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన ‘హనుమాన్’ బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి” అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

### యూఎస్‌లో ఆగని గన్ కల్చర్..
## పార్కు, యూనివర్సిటీలో కాల్పులు

ఢిల్లీ: అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

### కశ్మీర్‌లో ఆసక్తికర పరిణామం..
## టాప్ టెర్రరిస్ట్ ఇంటిపై రెపరెపలాడిన మువ్వన్నెల జెండా!


- లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబిద్ రంజాన్ షేక్ ఇంట్లో జాతీయ జెండా
- షాపియాన్‌లోని నివాసంపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేసిన ఉగ్రవాది తల్లిదండ్రులు
- 2021లో హిజ్బుల్ ఉగ్రవాది బుర్హాన్ వనీ తండ్రి కూడా ఇలాగే జెండా ఎగరేసిన వైనం
- రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి
- జమ్మూ కశ్మీర్ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన 80వ స్వాతంత్ర్య వేడుకలు




ఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఓ ఆసక్తికరమైన దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. భద్రతా దళాల మోస్ట్-వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబిద్ రంజాన్ షేక్ తల్లిదండ్రులు తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకున్నారు. షాపియాన్‌లోని వారి నివాసంపై తల్లి, తండ్రి ఇద్దరూ కలిసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న అబిద్ రంజాన్ షేక్, లోయలో జరిగిన అనేక ఉగ్రవాద దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు. ముఖ్యంగా, కశ్మీర్‌లో పనిచేస్తున్న వలసేతర కార్మికులపై లక్షిత దాడులకు ఇతడే ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంతటి కరుడుగట్టిన ఉగ్రవాది కుటుంబ సభ్యులు జాతీయ పతాకాన్ని ఎగరేయడం, మారుతున్న కశ్మీర్ పరిస్థితులకు అద్దం పడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి ఘటనే 2021లో కూడా చోటుచేసుకుంది. అప్పట్లో కశ్మీర్ యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించి, ఎన్‌కౌంటర్‌లో హతమైన హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వనీ తండ్రి ముజఫర్ వనీ కూడా స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగరేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన, తోటి ఉపాధ్యాయులతో కలిసి జెండా వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఇదిలా ఉంటే.. జమ్మూ కశ్మీర్ వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా లోక్ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ ఐక్యంగా ఉండి, పేదల పట్ల కరుణతో సమ్మిళిత సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. మరోవైపు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. 2019 ఆగస్టులో రద్దు చేసిన రాష్ట్ర హోదా, ఇతర రాజ్యాంగపరమైన హామీలను పునరుద్ధరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### కల్తీకి చెక్.. తెలంగాణలో ‘టీజీ సేఫ్’ ఏర్పాటు..
## ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు

- ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- ‘టీజీ సేఫ్’ పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు
- నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం
- ఆహార, ఔషధాల కల్తీని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం
- నియంత్రణ వ్యవస్థల ఆధునికీకరణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు



ఢిల్లీ: తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు ‘టీజీ సేఫ్’ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. ‘టీజీ సేఫ్’ నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 కింద నిబంధనల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచేస్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధికారుల చట్టబద్ధమైన అధికారాలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీకరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ..
## అర్ధరాత్రి నుంచి విమాన సర్వీసులు

ఈ అర్ధరాత్రి నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వాణిజ్య సేవలు ప్రారంభం
విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేత
తొలి రోజే హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు 31 విమాన సర్వీసులు
రికార్డు సమయంలో పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించారు
ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో ఈ విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని అంచనా



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ అర్ధరాత్రి 12:01 గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న ‘విజి’ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కోడ్‌ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, భారత వైమానిక దళం, ఇతర రక్షణ దళాలు, పోలీసు, ప్రభుత్వ ప్రత్యేక వీఐపీ విమానాల రాకపోకలకు మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించనున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లోనే పూర్తయి, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. షెడ్యూల్ కంటే దాదాపు ఐదు నెలల ముందే దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రలోని పూర్వపు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ సమీకృత ప్రాజెక్టు మొత్తం 2,703.26 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 2,203.32 ఎకరాలు విమానాశ్రయానికి, 500 ఎకరాలు ఏవియేషన్ హబ్‌కు, 136.63 ఎకరాలు ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీకి కేటాయించారు. ఎయిర్‌పోర్ట్‌లోని 3,800 మీటర్ల పొడవైన కోడ్-ఇ రన్‌వే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330, ఏ340 వంటి భారీ విమానాలను సైతం హ్యాండిల్ చేయగలదు. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలకు మద్దతుగా అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయం మొదలైందని చెప్పవచ్చు.

## అడవి జంతువులను వేటాడడం కోసం ఏర్పాటుచేసిన
# విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి



చిత్తూరు జిల్లా బంగారుపాలెం ఆగస్టు 16.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం గుంతూరు గ్రామానికి చెందిన ఘటన పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంగారుపాళ్యం సిఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు శనివారం రాత్రి బంగారుపాళ్యం మండలం గుంతూరు గ్రామానికి చెందిన



చిన్నస్వామి (45) సంవత్సరములు (తండ్రి) సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి శనివారం సాయంత్రం తన ఆవు కనిపించడం లేదని కొండ ప్రాంతంలోకి వెళ్ళాడు. ఆదివారం ఉదయం కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా ఒక మామిడి తోటలో గుర్తుతెలియని దుండగులు జంతువులను వేటాడడం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. నరసింహనాయుడు అనే వ్యక్తి పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవి జంతువుల కోసం అమర్చిన కరెంటు వైర్ కు ఇతను ప్రమాదవశాత్తు తగిలి అక్కడకక్కడే మృతి చెందినట్లు తెలిసింది. అడవి ఆదుకుని ఉన్న ఒక మామిడి తోట నందు ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ఈ ఘటన పైన అతని భార్య భారతీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

## పి.జి.ఆర్.ఎస్ పై క్యూ.ఆర్‌కోడ్ ద్వారా
# స్పందన తెలియజేయండి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 16 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత, జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్కులు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని సూచించారు. - క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

## ఈ నెల 17 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో
## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ



తిరుపతి, మహి న్యూస్, ఆగష్టు 16 : ఈ నెల 17 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17 వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మలికిపురంలో ఘనంగా నూతన వస్త్ర,
# పాదరక్షల షాపు ప్రారంభోత్సవం



మలికిపురం, మహీన్యూస్, ఆగష్టు 16: అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం, మలికిపురంలో గంగుమల్ల ఆకాష్, బందారు ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వస్త్రాలు, పాదరక్షల దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ నూతన దుకాణాన్ని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణ నిర్వాహకులు గంగుమల్ల ఆకాష్, బందారు ప్రసాద్‌లకు నాయకులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలు, పాదరక్షలను అందిస్తూ వ్యాపార రంగంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జంపన





సత్యనారాయణ రాజు, అడబాల రమాదేవి, గుత్తుల ఉమామహేశ్వరరావు, కంచి జగదీష్, ఓగూరి సూరిబాబు, కౌరు శ్రీను, కడలి వెంకటరత్నం, కోళ్ళ పండు, కొల్లబత్తుల కుమార్, ఒగ్గు నాని, అడబాల శేషారావు, తాడి రాము, బొక్కా గోవిందు, దాట్ల శ్రీనివాసరాజు, అల్లూరి శరత్ రాజు, భూపతి ప్రసాద్, కడలి సత్యనారాయణ, నీలి సాయి, బొక్కా పృద్వి, చిక్కా కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నూతన వ్యాపార సంస్థను ప్రారంభించిన సందర్భంగా నిర్వాహకులకు పలువురు నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక సమావేశంలో పలు విషయాలపై
# చర్చలు జరిపిన ముస్లిం ఐక్యవేదిక నాయకులు

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం ఆగస్టు 16.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో ఆదివారం రాష్ట్ర ముస్లిం ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు జిల్లాల నుండి ముస్లిం ఐక్యవేదిక కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. తమకున్న సమస్యల పట్ల సమావేశంలో ప్రతి ఒక్కరూ మాట్లాడడం జరిగింది. తమ సమస్యలను ప్రభుత్వం తో చర్చించి సానుకూలంగా సమస్యలను తీర్చుకోవాలని పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు వినతి పత్రం అందజేయాలని వారు వెల్లడించారు. ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాల బంగారుపాళ్యంలో చదివి 962 మార్కుల సాధించిన షేతాజ్ భానుకు ప్రశంసలు గుప్పించి సెలవాతో సత్కరించి మేమెంటో ఐక్యవేదిక సంఘ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్







అహ్మద్ (అన్ను) మాట్లాడుతూ, ప్రభుత్వం బిసి మైనార్టీ రుణాలను ఇంతవరకు మంజూరు చేయలేదని, పూట గడవని వాళ్ళు ముస్లింల లో కూడా ఉన్నారని వెంటనే తమకు బీసీ రుణాలు ఇప్పించాలని తెలిపారు. గత ప్రభుత్వం లో ముస్లింలకు నాలుగు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారని, కూటమి ప్రభుత్వంలో ఆరు ఎమ్మెల్సీ పదవులైన ఇస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు తమను జెండా మోయడానికి ఉపయోగిస్తున్నారు తప్ప పేదవారిని ఆదుకోవడం మరిచిపోయారని మరొకసారి గుర్తు చేశారు. షేతాజ్ భానును ప్రభుత్వం అన్ని రకాలుగా



ఆదుకోవాలని, ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరించాలని, రాష్ట్ర ఐక్యవేదిక కూడా షేతాజ్ భానును ముందుకు తీసుకు రావడానికి అన్ని విధాల ప్రయత్నం చేస్తామని వస్తు రూపంలో కూడా ఆమెకు తగిన సహాయం చేస్తున్నట్లు వారు తెలిపారు. పై చదువులు చదవడానికి ఆమెకు తోడ్పాటుగా ముస్లిం ఐక్యవేదిక ఉంటుందని వారు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జఫ్ఫార్ పులి, ఉపాధ్యక్షులు సలహద్దీన్ అధికార ప్రతినిధి ఖలీల్ సైడ్, ప్రధాన కార్యదర్శి రెహమాన్ , రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు షోకత్, రాష్ట్ర లీగల్ అధ్యక్షులు మాలిక్, కోర్ కమిటీ సభ్యులు అల్లాబక్షు, జిల్లా లీగల్ అబ్దుల్ అజిత్, చిత్తూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ జైనుల్,




కోశాధికారి రహీం భాయ్, జాయింట్ సెక్రెటరీ బలిజపల్లి బాబు, సంతపేట బాబు హుస్సేన్ భాయ్, జిల్లా ఐటీ విభాగం జిల్లాని భాష, పూతలపట్టు అధ్యక్షులు కాజా, పలమనేరు అధ్యక్షులు ఫక్రుద్దీన్, పుంగునూరు అధ్యక్షులు ఖాదర్బాషా, కుప్పం అధ్యక్షులు రఫీక్ అల్తాఫ్ భాయ్ సాలిహా, ఉమ్మర్ బాయ్, మొగల్ గఫ్ఫార్ బాయ్, సోషల్ మీడియా సల్మాన్, యాదమరి మహబూబ్, రాజా, మహిళా అధ్యక్షులు సాహెబ్ బీ, అన్ని జిల్లాల నుండి పాల్గొన్నారు.

# సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

### డీఆర్వో కె. మోహన్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 16: స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 117 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్వో కె. మోహన్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచే ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించిన లచ్చన్న అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంతో పాటు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని గుర్తుచేశారు. జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, మద్యపాన నిషేధం కోసం, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, పేదలు, బీసీ, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకమై పనిచేయడం లచ్చన్న ప్రత్యేకత అని తెలిపారు. రాజకీయాల్లో నిబద్ధత, నిజాయితీ, నిక్కచ్చితనం, ప్రజల పట్ల బాధ్యత వంటి విలువలను ఆయన ఆచరించి చూపారని అన్నారు. పెద్దలను సైతం ప్రశ్నించాల్సిన సందర్భంలో వెనుకాడకుండా, తన అభిప్రాయాన్ని సహేతుకంగా వ్యక్తం చేసే ధైర్యం ఆయనలో ఉండేదని పేర్కొన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి లచ్చన్న చేసిన కృషి చిరస్మరణీయమని, సమాజంలోని అణగారిన వర్గాలకు ప్రత్యేక గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన పోరాటం నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. అధికారంలో ఉన్న సమయంలోనే కాకుండా ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. లచ్చన్న జీవితాన్ని పరిశీలిస్తే దాదాపు జీవితాంతం ప్రజా పోరాటమే కనిపిస్తుందని, ఆయన చూపిన మార్గం ప్రస్తుత రాజకీయ నాయకులు, యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంతకాలం జీవించామన్నది కాకుండా సమాజంపై ఎంతటి సానుకూల ప్రభావం చూపించామన్నదే ముఖ్యమని, ఆ కోణంలో లచ్చన్న జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ .సి కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్,బీసీ సంక్షేమ శాఖఅధికారి రబ్బానీ భాష, జిల్లా మత్స్య శాఖాధికారి జి జే ప్రమోద మల్లె,నాగరాజు గౌడ్ ,కృష్ణమూర్తి గౌడ్,గోపి గౌడ్ గారు, ఈశ్వరయ్య ఎక్సైజ్ సి.ఐ (రిటైర్డ్),పి రవి ఎంబీసీ లీడర్, బీజేపీ లీడర్ అట్లూరి శ్రీనివాసులు, నిరదక్షులు గౌడ్, ప్రభావతమ్మ, ప్రసాద్, జనార్దన్ గౌడ్, ఈడిగ కులస్తులు ఇతర ప్రజాప్రతినిధులు మరియు బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జీవితంలోని విలువలు, సమాజానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ప్రముఖులు స్మరించుకున్నారు. అంతకుముందు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఇంటింటా టీడీపీ ప్రచారం..
# అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు అవగాహన



మలికిపురం, మహి న్యూస్, ఆగస్టు 16: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మలికిపురం గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మలికిపురం గ్రామశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి అమూల్య స్వయంగా పలు గృహాలను సందర్శించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించే దిశగా తమ వంతు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు జంపన సత్యనారాయణ రాజు, అడబాల రమాదేవి శేషారావు, గుత్తుల ఉమామహేశ్వరరావు, కంచి జగదీష్, ఓగూరి సూరిబాబు, కౌరు శ్రీను, కడలి వెంకటరత్నం, కోళ్ల పండు, కొల్లబత్తుల కుమార్, ఒగ్గు నాని, తాడి రాము, బొక్కా గోవింద్, దాట్ల శ్రీనివాసరాజు, అల్లూరి శరత్ రాజు, భూపతి ప్రసాద్, కడలి సత్యనారాయణ, కడలి సాయి, బొక్కా పృద్వి, చిక్కా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా
# అనకాపల్లి రూరల్ ఎస్సై ఘన నివాళి




అనకాపల్లి, మహి న్యూస్, ఆగస్టు 16: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు, అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి.రవికుమార్ ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ – "ఈ రోజు గౌతు లచ్చన్న జయంతి. ఈ సంవత్సరం ఆయన 117వ జయంతి ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించబడుతోంది. గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాకుండా, ప్రముఖ రాజకీయ నాయకుడు, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయ సామాజికవేత్త. ఆయన చూపిన మార్గదర్శకత్వం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం" అని అన్నారు. జిల్లా పోలీసులు ఆయన ఆత్మస్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆయన ఆలోచనలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు కార్యాలయ పోలీస్ సిబ్బంది పాల్గొని గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## కాపవరంలో బీసీలకు స్మశాన వాటిక కరువు..
# దహన సంస్కారాలకు స్థలం లేక అవస్థలు

కాపవరం, మహి న్యూస్, ఆగస్టు 16: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం కాపవరం గ్రామంలో బీసీ కమ్యూనిటీకి ప్రత్యేక స్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీసీ కులపెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు నిర్వహించేందుకు కనీసం సెంటు భూమి కూడా అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలోని ఇతర ప్రాంతాల్లో స్మశాన వాటికలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ, కాపవరంలో బీసీ కమ్యూనిటీకి సంబంధించిన స్మశాన వాటిక విషయంలో మాత్రం ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, బీసీ కమ్యూనిటీ స్మశాన వాటికకు సంబంధించిన స్థలాన్ని పూర్తిగా గుర్తించి, అవసరమైన భూమిని సేకరించి అభివృద్ధి చేయాలని కోరారు. స్మశాన వాటిక కోసం స్థలం కల్పించి, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే గ్రామంలోని బీసీ కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సమస్యను ఫిర్యాదుగా స్వీకరించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టి ప్రజలకు సహకారం అందించాలని బీసీ కులపెద్దలు శీలబోయిన శ్రీనివాస్ సహా పలువురు కోరారు.

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

### – రెండు రోజుల సెలవులతో విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో రద్దీ

**విజయవాడ, మహి న్యూస్, ఆగష్టు 16 : స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), ఆదివారం (ఆగస్టు 16) వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ సన్నిధికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఘాట్ రోడ్, క్యూ లైన్లునిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విఐపి దర్శనములు మరియు అంతరాలయ దర్శనములు భక్తులు సౌకర్యార్థం ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 3 గంటల వరకు దర్శనము నిలుపుదల చేయు నిర్ణయం తీసుకొనడం అయినది. కొండపైకి వచ్చే వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక వాహనాలను బ్యాటరీ వెహికల్స్ వీల్ చైర్స్ వినియోగించుకుని ఉన్నారు . క్యూ లైన్లలో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. దర్శన సమయాన్ని పొడిగించడంతో పాటు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు రద్దీ నేపథ్యంలో ఆలయ పాలకమండలి చైర్మన్ రాధాకృష్ణ గాంధీ ఈఓ శీనా నాయక్ (కార్యనిర్వహణాధికారి) స్వయంగా క్యూ లైన్లను పరిశీలించారు. వారు నేరుగా భక్తులతో మాట్లాడి, అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి ఎంత సమయం పడుతోంది, తాగునీరు, పాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా దర్శనం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా విజయవాడ పోలీసులు ఘాట్ రోడ్ పరిసరాల్లో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు. ఆలయ పెద్దలు దేవస్థాన సిబ్బంది పోలీస్ సిబ్బంది శ్రమతో ఎటువంటి చిన్నపాటి ఘటనలు జరగకుండా దర్శనములు ప్రశాంతంగా జరిగినవి**

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన కర్నూలు పోలీసులు



కర్నూలు, ఆగస్టు 16: (మహి న్యూస్) : కర్నూలు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కర్నూలు పోలీసులు రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సంబంధిత పోలీసు అధికారులు రౌడీ షీటర్లకు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో జీవించాలని పోలీసులు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సమాజంలో శాంతియుతంగా జీవిస్తూ కుటుంబ సభ్యులు, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. ఇకపై ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి సహకరించాలని పోలీసులు రౌడీ షీటర్లకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.






## పి.జి.ఆర్.ఎస్‌పై క్యూ ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

కర్నూలు, ఆగస్టు 16: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు ప్రభుత్వం క్యూ ఆర్ కోడ్‌ను రూపొందించిందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా పి.జి.ఆర్.ఎస్‌పై తమ స్పందనను తెలియజేయాలని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడంతో పాటు ప్రజల నుంచి నిరంతరం అభిప్రాయాలను సేకరించి వారి సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల్లో భాగంగానే క్యూ ఆర్ కోడ్ ద్వారా పి.జి.ఆర్.ఎస్‌పై ప్రజల స్పందనను తెలుసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదికపై తమ అభిప్రాయాలు, సూచనలు, స్పందనను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి కోరారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 16:- జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 17వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రా+సా)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## పీజీఆర్ఎస్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలి

### – జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా




నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 16: ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పై ప్రజలు విస్తృతంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. ప్రజలు తమకు అందిన సేవలు, సమస్యల పరిష్కారంపై తమ అభిప్రాయాన్ని పీజీఆర్ఎస్ ఫీడ్బాక్ ద్వారా తెలియజేయవచ్చు. ఇందుకోసం https://pgrs.ap.gov.in/ Home/QRGGrievanceFeedback వెబ్‌సైట్‌ను సందర్శించడంతో పాటు, అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ ఫీడ్‌బ్యాక్‌ను నమోదు చేయవచ్చు. ప్రజలకు అందించిన సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి వారి అభిప్రాయాలు ఎంతో కీలకమని అధికారులు తెలిపారు. తమకు అందిన సేవలపై సంతృప్తి, సూచనలు లేదా ఇతర అభిప్రాయాలను ఫీడ్‌బ్యాక్ రూపంలో తెలియజేయాలని అన్నారు. ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం

### రాత్రి వేళల్లో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

### రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం




కర్నూలు, ఆగస్టు 16: (మహి న్యూస్): కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. నేరాల నియంత్రణలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, కూడళ్లు, సున్నితమైన ప్రాంతాల్లో పోలీసుల నిఘాను మరింత పెంచారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కర్నూలు నగరంలో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బ్లూ కోల్ట్స్, క్యూఆర్‌టీ పోలీసు బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు అలసట, నిద్రమత్తుకు గురైనప్పుడు వాహనాలను ఆపి, ముఖం కడుక్కొని, అప్రమత్తమైన అనంతరం ప్రయాణం కొనసాగించాలని సూచిస్తున్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా పోలీసు అధికారులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.






# జర్నలిస్టుల హక్కుల కోసం సమరశంఖం

### అణచివేతపై అక్షర పోరాటం..
### కలానికి కవచంగా ఏపీఎంఎఫ్
### హక్కుల కోసం ఒక్కటైన కలం..
### జర్నలిస్టుల సమస్యలపై సమరభేరి
### పత్తికొండలో ఏపీఎంఎఫ్ కమిటీ ఏర్పాటు
### ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్, భద్రతపై
### సమష్టి కార్యాచరణ



కర్నూలు, ఆగస్టు 16: (మహి న్యూస్): జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, మీడియా ప్రతినిధులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. పత్తికొండ నియోజకవర్గ ఏపీఎంఎఫ్ కమిటీ నిర్మాణ మహాసభ కర్నూలు జిల్లా కన్వీనర్ ఎం. సాయి కుమార్ నాయుడు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నూతన కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. మద్దిలేటి, జిల్లా కన్వీనర్ ఎం. సాయి కుమార్ నాయుడు, జిల్లా కో-కన్వీనర్లు ఆర్. బాలకృష్ణ, కె. రంగనాథ్, బి. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### నూతన కమిటీ ఏర్పాటు

పత్తికొండ నియోజకవర్గ ఏపీఎంఎఫ్ అధ్యక్షుడిగా మద్దికేర శేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా సి. సురేష్, కార్యదర్శిగా వీవీ నాయుడు, కోశాధికారిగా విష్ణువర్ధన్ గౌడ్‌ను ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా బి. రంగన్న, రాం ప్రతాప్ గౌడ్, సి. రాము, పి. రాజు, మహేష్, వి. నాగార్జున, రామాంజనేయులు నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు సహచర పాత్రికేయులు అభినందనలు తెలిపారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించాలి

జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని నాయకులు కోరారు. దశాబ్దాలుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల్లో చాలామందికి సొంత ఇల్లు లేకపోవడం ఆందోళనకరమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు లేదా గృహ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ సహకారం అందేలా యూనియన్ సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.

### అక్రిడేషన్ హక్కు.. వృత్తికి గుర్తింపు

జర్నలిస్టులకు అక్రిడేషన్ కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదని, వృత్తిపరమైన హక్కులు, ప్రభుత్వ సమాచార వ్యవస్థకు ప్రాప్యత, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాలతో ముడిపడి ఉన్న అంశమని నాయకులు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా అక్రిడేషన్ లభించేలా నిబంధనలు అమలు చేయాలని, చిన్న పత్రికలు, స్థానిక మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

### జర్నలిస్టులపై దాడులకు అడ్డుకట్ట

వార్తా సేకరణలో భాగంగా జర్నలిస్టులు రాజకీయ, సామాజిక, ప్రజా సమస్యలను ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని నాయకులు గుర్తుచేశారు. ఈ క్రమంలో జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు చోటుచేసుకుంటే తక్షణమే స్పందించే విధంగా జర్నలిస్టుల భద్రత, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన జర్నలిస్టులకు న్యాయ సహాయం, పోలీసు రక్షణ, సంబంధిత అధికారులతో సమన్వయం వంటి అంశాల్లో యూనియన్ అండగా నిలవాలని సమావేశంలో నిర్ణయించారు.

### హక్కులతో పాటు బాధ్యతలు కూడా

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతోపాటు వృత్తి విలువలను కాపాడటం కూడా అంతే ముఖ్యమని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడం, వార్తల్లో వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వడం, వ్యక్తిగత ప్రయోజనాలకు దూరంగా ఉండటం, బాధితుల గోప్యతను గౌరవించడం వంటి అంశాలను జర్నలిస్టులు పాటించాలని సూచించారు. ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా ప్రచురించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించడం జర్నలిస్టుల ప్రధాన విధుల్లో ఒకటని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా భావించే మీడియా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే జర్నలిస్టులు నిష్పక్షపాతంగా, వాస్తవాధారితంగా పనిచేయాలని సూచించారు.

### ఐక్యతే బలం

ఒక్కో జర్నలిస్టు తన సమస్యను వ్యక్తిగతంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయడం కంటే అందరూ ఒకే వేదికపైకి వచ్చి సమష్టిగా సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమ సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు, ఇళ్ల స్థలాల కోసం పోరాటం, అక్రిడేషన్ సమస్యల పరిష్కారం, దాడులపై తక్షణ స్పందన, న్యాయ సహాయం, వృత్తిపరమైన శిక్షణ, ఆరోగ్య బీమా వంటి అంశాలపై సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.



### జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వ చేయూత అవసరం

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశం కోరింది. జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, పిల్లల విద్యకు సహాయం, వృద్ధాప్యంలో భరోసా, గృహ వసతి వంటి అంశాల్లో ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పత్తికొండ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుని వారి సమస్యలను గుర్తించి, దశలవారీగా పరిష్కరించేందుకు నూతన కమిటీ పనిచేస్తుందని నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే జర్నలిస్టుల బాధ్యత కాగా, జర్నలిస్టుల హక్కులను కాపాడటమే యూనియన్ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ రెండు బాధ్యతలు సమన్వయంతో సాగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని సమావేశం అభిప్రాయపడింది.

# కాంగ్రెస్‌ను 'దిమాగీ నక్సల్స్ కాంగ్రెస్ పార్టీ'గా మార్చుకోండి

### వందేమాతరాన్ని అవమానించిన కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
### బీజేపీ నేత యస్ , విష్ణువర్ధన్ రెడ్డి



పుట్టపర్తి, మహి న్యూస్, ఆగస్టు 16: కాంగ్రెస్ పార్టీపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకుని 'దిమాగీ నక్సల్స్ కాంగ్రెస్ పార్టీ'గా పేరు మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. పారామిలటరీ దళాలు, గిరిజనులను బలితీసుకున్న నక్సలిజాన్ని సమర్థించేలా కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం చేసిన 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ అసలు వైఖరిని బయటపెట్టాయని విమర్శించారు. భారత అణు కార్యక్రమం నుంచి డిజిటల్ విప్లవం వరకు దేశం సాధించిన విజయాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తూ వచ్చిందని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. దేశ అణు, రక్షణ రంగాన్ని వ్యతిరేకించడం, యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఎగతాళి చేయడం, 'కాషాయ ఉగ్రవాదం' వంటి పదాలను ఉపయోగించడం కాంగ్రెస్ పార్టీ మేధో నక్సలిజానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నేతల వ్యవహారశైలిని కూడా ఆయన తప్పుబట్టారు. దేశీయ సాంకేతిక పురోగతిపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలు ఆ పార్టీ దేశ ప్రగతి పట్ల ఉన్న వైఖరిని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. తుపాకీ పట్టిన నక్సలిజం మోదీ ప్రభుత్వ హయాంలో అంతమవుతున్న సమయంలో.. 'అర్బన్ నక్సల్స్', దేశ విచ్ఛిన్నకర శక్తులకు రాజకీయ, మేధో రక్షణ కల్పించే ప్రయత్నాలకు కాంగ్రెస్ పార్టీ ముందుండటం విచారకరమని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. దేశ ప్రగతిని అడ్డుకోవాలని, వ్యూహాత్మక భద్రతను దెబ్బతీయాలని చూసే ఇలాంటి రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని పేర్కొన్నారు. వందేమాతరాన్ని అవమానించిన సోనియా గాంధీ వైఖరి ద్వారా కాంగ్రెస్ పార్టీకి దేశం పట్ల ఉన్న గౌరవం మరోసారి నిరూపితమైందని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జాతీయ గౌరవం, దేశభక్తి, దేశ ప్రగతి వంటి అంశాల్లో కాంగ్రెస్ పార్టీ వైఖరిని దేశ పౌరులు, ముఖ్యంగా యువత గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఆ పార్టీకి గట్టి సమాధానం ఇస్తారని ఆయన అన్నారు. తక్షణమే కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రియాంకకు నివాళుల పేరుతో రాజకీయం చేశారు



రాజమహేంద్రవరం, మహి న్యూస్, ఆగస్టు 16 : ఇటీవల రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న మెడికో ప్రియాంక మృతి ఘటన నేపథ్యంలో ఆమెకు నివాళులు అర్పించేందుకు తమ కళాశాల విద్యార్థినులను పంపాలని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, ఆయన కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా కోరినట్లు సాయి నర్సింగ్ కళాశాల అధినేత డీవీ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు పత్రిక ప్రకటన, ఒక వీడియో విడుదల చేశారు. నివాళుల కార్యక్రమం పేరుతో విద్యార్థినులను అక్కడికి పంపిన విషయం తనకు ముందుగా తెలియదని, తనను సంప్రదించకుండానే కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను పంపడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ప్రియాంక మృతి పట్ల సానుభూతితో ఆమెకు నివాళులు అర్పించేందుకు విద్యార్థినులను పంపాలని కోరడంతోనే తమ కళాశాల ప్రిన్సిపాల్ చెప్పారని డీవీ సుబ్బారావు తెలిపారు. అయితే అక్కడికి వెళ్లిన అనంతరం విద్యార్థినులకు ప్లకార్డులు, క్యాండిల్స్ అందించి కార్యక్రమానికి రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు. మృతురాలికి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ముగించి ఉంటే ఎలాంటి అభ్యంతరం ఉండేది కాదని పేర్కొన్నారు.

### "మా కళాశాల రాజకీయాలకు పూర్తిగా అతీతం"

తమ విద్యాసంస్థలు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కానీ, వ్యతిరేకంగా కానీ వ్యవహరించవని డీవీ సుబ్బారావు స్పష్టం చేశారు. తాము ఒక స్వచ్ఛంద సంస్థగా, విద్యాసంస్థగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా గానీ, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ తమ సంస్థ వ్యవహరించదన్నారు. అయితే ప్రిన్సిపాల్ స్థాయిలో మాజీ ఎంపీ వంటి ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి వచ్చిన విజ్ఞప్తికి గౌరవం ఇచ్చి విద్యార్థినులను పంపించి ఉండవచ్చని తెలిపారు.

### విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించొద్దు

ప్రియాంక మృతి పట్ల తమకు కూడా సానుభూతి ఉందని, ఆమెకు నివాళులు అర్పించడాన్ని తాము తప్పుపట్టడం లేదని డీవీ సుబ్బారావు తెలిపారు. అయితే సానుభూతి కార్యక్రమాన్ని రాజకీయ కార్యక్రమంగా మార్చి విద్యార్థులకు ప్లకార్డులు, క్యాండిల్స్ అందించి రాజకీయ నినాదాలు లేదా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం మాత్రం సరికాదన్నారు. "మమ్మల్ని ఎవ్వరినీ రాజకీయాల్లోకి లాగవద్దు... మా విద్యార్థులకు, విద్యాసంస్థలకు రాజకీయ రంగు పులమవద్దు... మేము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నాం... మా పిల్లలను కూడా రాజకీయాలకు దూరంగా ఉంచాలనుకుంటున్నాం" అని డీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

### మా విషయంలో కూడా అదే జరిగింది
### ప్రియదర్శిని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా కుమారి

సాయి నర్సింగ్ కళాశాలకు జరిగిన మాదిరిగానే తమ కళాశాలకు జరిగిందని ప్రియదర్శిని నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ ఎస్ రాధా కుమారి తెలిపారు. తమ కళాశాల విద్యార్థినులను కూడా కార్యక్రమానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలను రాజకీయాలకు వేదికలుగా మార్చకుండా అన్ని రాజకీయ పక్షాలు బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. ప్రియాంక మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేయడం, నివాళులు అర్పించడం వరకు మాత్రమే కార్యక్రమాన్ని పరిమితం చేసి ఉంటే బాగుండేదని, అనవసరంగా విద్యార్థులను రాజకీయ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం వల్ల విద్యాసంస్థల ప్రతిష్ఠకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, విద్యాసంస్థలకు రాజకీయ రంగు పులమకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

